వరదనీటి సమస్యను పరిష్కరించండి

● అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కాలనీవాసులు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధి ఎఫ్‌సీఐ కాలనీ ప్రధాన రోడ్డులో వర్షంనీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం ఎఫ్‌సీఐ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి కాలనీ సమస్యలను వివరించగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రవికుమార్, నర్సింహారావు, చంద్రశేఖర్‌రెడ్డి, సత్యనారాయణ ఉన్నారు.

కోల్డ్‌ఫ్లేట్ మిషన్ ప్రారంభం

వనస్థలిపురం: వనస్థలిపురంలోని మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రిలో బుధవారం పాథాలజీ విభాగంలో పారాఫిన్ డిస్పెన్సర్, కోల్డ్‌ఫ్లేట్ మిషన్‌ను సూపరింటెండెంట్లు డా.నాగేందర్, డా.కృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు లక్ష్మీ, ఉమాశంకర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

చంపాపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతా


రోడ్డు పనులను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని సమస్యలు పరిష్కరించి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన డివిజన్ పరిధిలోని దుర్గాభవానీనగర్ కాలనీలో రూ.40 లక్షలతో ప్రారంభించిన సీసీ రోడ్ల పనులను పరిశీలించి మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని సకాలంలో పూర్తిచేసి అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, వెంకట్, గజేంద్ర, శేఖర్, నాయకులు శేఖర్, శ్రీనివాస్‌నాయుడు, సంజయ్ పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడాపోటీలు

మలక్‌పేట: హైదాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, సైదాబాద్ జోన్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి మూడ్రోజుల పాటు క్రీడా పోటీలు జరుగుతాయని జోన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ హరికృష్ణ తెలిపారు. మూసారంబాగ్ డివిజన్‌స్వామి వివేకానంద సెంటనరీ స్కూల్ ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు క్రీడలు ప్రారంభం అవుతాయని అండర్–17 బాయ్స్ అండ్ గర్ల్స్, అండర్–14 బాయ్స్, అండ్ గర్ల్స్‌కు కబడ్డీ, ఖోఖో పోటీలు ఉంటాయన్నారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ



చాదర్‌ఘాట్: దోమకాటు ప్రాణంతక వ్యాధి అని వాటి నుంచి అప్రమత్తంగా ఉండాలని యూపీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ తరుణి అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఓల్డ్‌మలక్‌పేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దోమకాటుతో మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు లాంటి జబ్బులు వస్తాయని పూలకుండీలు, కూలర్లు, నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సాయంత్రం కిటికీలు, తలుపులు మూసివేయాలని సూచించారు.

సాఫ్ట్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

మలక్‌పేట: సమాజంలో రాణించాలంటే సాఫ్ట్ స్కిల్స్ పెంపొందించుకోవాలని నోబుల్ విద్యాసంస్థల చైర్మన్ ఆర్. రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మాజిక్ బస్ ఫౌండేషన్, ఇన్ఫోసిస్ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్ నోబుల్ డిగ్రీ, పీజీ కళాశాలలో 12 రోజుల పాటు ఏఐ సాఫ్ట్ స్కిల్స్‌పై నిర్వహించిన శిక్షణ తరగతులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు రాజేశ్వర్‌రెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి కమ్యూనికేషన్ స్కిల్స్, ఇతర అంశాలలో ప్రావీణ్యం పొందాలన్నారు. ఇలాంటి శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పార్థసారథి, విఠల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొంగుతున్న డ్రైనేజీలు.. బురదమయంగా రోడ్లు

ఎల్‌బీనగర్: తేలికపాటి వర్షాలకే ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని డ్రైనేజీలు పొంగడం పరిపాటిగా మారింది. దీనికి తోడు పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో దుర్గంధంగా మారుతోంది. వర్షాలకు నీరు నిలుస్తుండటంతో దోమ కాట్లకు గురై ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నామని ఆయా కాలనీవాసులు వాపోతున్నారు. దీనికి తోడు పలు ప్రాంతాల్లో ఉన్న మట్టి రోడ్లు వర్షాలకు బురదగా మారుతుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై ఏర్పడుతున్న గుంతలో వర్షం నీరు చేరుతుంది. ఆ గుంతలు కనబడక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆయా కాలనీల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


మన్సూరాబాద్‌లో పొంగుతున్న డ్రైనేజీ


బురదమయంగా బృందావన్ మేడోస్‌కాలనీ దారి

గుంతలు.. వర్షాలకు రెండింతలు!

నాగోలు: తరచూ కురుస్తున్న భారీ వర్షాలతో ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధి వివిధ కాలనీల్లో రోడ్లు గుంతలమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నాగోలు, కొత్తపేట డివిజన్ల పరిధిలోని వివిధ కాలనీల్లో రోడ్లు, ప్రధాన రహదారులతో పాటు వివిధ బస్తీల్లోని అంతర్గత రహదారులు సైతం గుంతలమయంగా మారాయి. జైపురికాలనీ చౌరస్తా నుంచి నాగోలుకు వెళ్లే దారి, బ్లైండ్స్ కాలనీ వెళ్లే రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడి వర్షం నీరు నిలిచి ప్రమాదాలకు నిలయంగా మారాయి. గతంలో జలమండలి అధికారులు వరద నీటి పైప్‌లైన్ కోసం రోడ్డు తవ్వి పనులు పూర్తయిన తర్వాత మరమ్మతు చేయకుండా మట్టిపోసి వదిలేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి రోడ్లపై ఉన్న మట్టి కొట్టుకుపోయి కంకర తేలింది. బండ్లగూడ గ్రామంలో సైతం జీహెచ్‌ఎంసీ అధికారులు గతంలో వరద నీటి పైపులైన్ కోసం రోడ్డును తవ్వి వదిలేశారు. దీంతో బురద, గుంతలమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. నాగోలు సాయినగర్, మమతనగర్, ఇంద్రప్రస్థాకాలనీ, బృందావన్ కాలనీ, సత్యనగర్, ఎస్‌ఆర్‌ఎల్ కాలనీలోని రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.


జైపురికాలనీ వెళ్లే దారిలో గుంతలుగా మారిన రోడ్డు


బ్లైండ్స్ కాలనీకి వెళ్లే రోడ్డు ఇలా..


గుంతలు పడిన రేడియల్ రోడ్డు

క్రీడా పాలసీతో ఆటగాళ్లకు మేలు


రన్‌లో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి

దిల్‌సుఖ్‌నగర్: క్రీడా పాలసీతో ఎంతోమంది విద్యార్థులు, క్రీడాకారులకు మేలు చేకూరుతుందని క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆల్ ఇండియా రాజీవ్ గాంధీ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ ఖేల్ ఉత్సవ్ రన్ ను బుధవారం కొత్తపేట ఓమ్ని చౌరస్తాలో ఆయన మధుయాష్కీ గౌడ్, ఎమ్మెల్సీ బొగ్గారాపు దయానంద్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి ప్రారంభించారు. కొత్తపేట ఓమ్ని చౌరస్తా, ఎన్టీఆర్ నగర్ చౌరస్తా వద్ద రాజీవ్ గాంధీ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తానూ క్రికెట్ క్రీడాకారుడినని, తన చిన్నప్పుడు ప్రోత్సహించేవారు లేరని, ఆడుకోవడానికి ఆట స్థలాలు కూడా లేవని కానీ రాష్ట్ర ప్రభుత్వం నేడు విద్యార్థులకు మంచి అవకాశాలు కల్పిస్తూ క్రీడా యూనివర్సిటీతో పాటు క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. మధుయాష్కీ సూచన మేరకు సరూర్‌నగర్ స్టేడియంలో జిమ్ ఏర్పాటుకు రూ.2.50 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ.. గత పదేళ్లలో తెలంగాణలో క్రీడలను నిర్లక్ష్యం చేశారని యువత డ్రగ్స్ బారిన పడకుండా క్రీడల వైపు మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దేప భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరావు, ఏసీపీ కృష్ణయ్య దొంతి వినోద్ కుమార్, శ్రీపాల్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, పృథ్వీచౌదరి, లింగాల కిషోర్‌గౌడ్, వేణుగోపాల్ యాదవ్, సురేందర్ రెడ్డి, మంజులా రెడ్డి, శశిధర్ రెడ్డి, సత్యనారాయణ, రామారావు, పాశం అశోక్ గౌడ్, పన్యాల జైపాల్ రెడ్డి, గణేష్ నాయక్, చిలుక ఉపేందర్‌రెడ్డి, పున్న గణేష్‌నేత పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల అందజేత

నాగోలు: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించడం అభినందనీయమని జైపురికాలనీ ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సరస్వతి–కృష్ణ దంపతులు తమ కూతురు సాన్వి (12) పుట్టిన రోజు సందర్భంగా బుధవారం తొమ్మిది కుర్చీలను అందజేశారు. సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..పాఠశాల అభివృద్ధికి సంబంధించి గత మూడు సంవత్సరాల నుంచి విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంతరెడ్డి, రాజేశ్వరి, రమాదేవి పాల్గొన్నారు.



పండగలు ఐక్యతకు దోహదం

హయత్‌నగర్: గ్రామస్థాయిలో జరిగే పండుగలు ఐక్యతకు దోహదపడుతాయని అందరు ఏకతాటిపైకి వచ్చి బొడ్రాయి(నాభిశిల)స్థాపనకు ముందుకు రావడం శుభపరిణామం అని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. బుధవారం హయత్‌నగర్‌లో నాభిశిల ప్రతిష్ఠాపన ఆహ్వాన పత్రికను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామస్తులంతా కలిసి మెలిసి పండుగలు జరుపుకోవాలని గ్రామ సంక్షేమాన్ని కోరి నిర్వహిస్తున్న నాభిశిల ప్రతిష్ఠాపనకు తమ వంతు సహకారాన్ని అందిస్తామన్నారు. కులమతాలకు అతీతంగా పండుగను వైభవంగా నిర్వహించాలని కోరారు. ఎంతో చరిత్ర కలిగిన హయత్‌నగర్‌లో అనేక దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు ఉన్నాయని, అన్ని వర్గాల పడుగలను కలిసి మెలసి జరుపుకోవడం ఇక్కడి ప్రజల ఐక్యతను చాటుతుందన్నారు. కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ... గ్రామస్తుల క్షేమాన్ని కాంక్షిస్తూ ఎంతో కాలంగా బొడ్రాయిని స్థాపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఇప్పటి గ్రామస్తులంతా పండుగను నిర్వహించేందుకు పార్టీలకు అతీతంగా ఐక్యంగా ముందుకు రావడం గొప్ప విషయం అన్నారు. అక్టోబర్ 9 నుంచి నాలుగు రోజులు ఈ పండుగను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు బోడ భిక్షపతి, రవిందర్‌రెడ్డి, నాయకులు నక్క రవిందర్‌గౌడ్, భాస్కర్‌సాగర్, నక్క దర్శన్‌గౌడ్, భాస్కర్, చెన్నగోని శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్

అక్రమాలపై విజిలెన్స్‌తో విచారణ చేయించాలి


కమ్యూనిటీహాల్‌ను పరిశీలిస్తున్న శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: సంతోష్‌నగర్ సర్కిల్ ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనుల పేరిట జరిగిన అక్రమాలపై విజిలెన్స్‌తో విచారణ చేయించి వాస్తవాలు వెలికి తీయాలని కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి డిమాండ్ చేసారు. బుధవారం ఆమె బీజేపీ నాయకులు, దామోదర సంజీవయ్య నగర్ బస్తీవాసులతో కలిసి అధికారులు పనులు పూర్తి చేసామన్న రెండు కమ్యూనిటీ హాళ్లను పరిశీలించి మాట్లాడారు. సంతోష్‌నగర్ సర్కిల్ అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మకై ప్రజాధనాన్ని లూటీ చేశారని విమర్శించారు. రెండు కమ్యూనిటీ హాళ్లు, బాక్స్ డ్రెయిన్ పనులు చేపట్టకుండానే రికార్డుల్లో పూర్తి చేశామని తప్పుడు నమోదులు చేసి డబ్బులు తమ జేబుళ్లలోకి వేసుకున్నారన్నారు. అధికారులు సకాలంలో స్పందించి తగిన చర్యలు తీసుకోకుంటే న్యాయ పోరాటం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జంగం మధుకర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి


జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

లింగోజిగూడ: డివిజన్ పరిధి గ్రీన్‌పార్క్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు బుధవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. కాలనీలో నాలాల నిర్వహణ లోపంతో మురుగు నీరు రోడ్లపై పారుతుందన్నారు. నాలాల నిర్మాణం సమయంలో స్లాబ్‌లకు వేసిన సెంట్రింగ్‌ను తీయకుండా అలాగే వదిలేసారని దీంతో వరద నీరు సాఫీగా పారడం లేదన్నారు. పూడికతీతలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. మెగా ఫంక్షన్ హాల్ నుంచి వచ్చే వరదను శ్రీనివాస్ కాలనీలో కలపాలని కోరారు. కాలనీ ఎఫ్‌టీఎల్ సమస్యను పరిష్కరించి ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జగన్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, రామయ్య, సుధాకర్ రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, సురేష్, యాద లక్ష్మి, సువర్ణ, అనిల్ యాదవ్, అనసూయ పాల్గొన్నారు.

నియామకం

నాగోలు: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మాల్కాజిగిరి పార్లమెంట్ కోకన్వీనర్‌గా ఎల్‌బీనగర్‌కు చెందిన బ్రహ్మచారిని నియమిస్తూ కార్యదర్శి రవినూతల శశిధర్ బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. గణేష్ ఉత్సవాలను అందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

నాగోలు: నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని బ్యాంక్ ఆఫ్ బరోడా రిజనల్ మేనేజర్ సుగుణావతి అన్నారు. బుధవారం కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సుగుణావతి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బందికి ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు కృతజ్ఞతలు తెపారు. ఈ కార్యక్రమంలో సునీత, అరుణ జ్యోతి, సంధ్య, అంజనాదేవి, శైలజ పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సిబ్బంది

విద్యాహక్కు, పోక్సో చట్టాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న జడ్జి కిరణ్మయి

మలక్‌పేట: మలక్‌పేటలోని ప్రభుత్వ ఎస్టీ బాలుర హాస్టల్లో బుధవారం హైదరాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సిటీసివిల్ కోర్టు ఆధ్వర్యంలో లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ జడ్జి కిరణ్మయి హాజరై విద్యాహక్కు, పోక్సో, ఇతర చట్టాలపై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సేవలు ఎలా పొందాలో వివరించి, సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం హాస్టల్‌లోని సౌకర్యాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యుడు బి. సురేష్ కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కేబుళ్లు తొలగించాలని వినతి

సైదాబాద్: విద్యుత్ స్తంభాలపై ప్రమాదకరంగా వేలాడుతున్న కేబుళ్లను వెంటనే తొలగించాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఆమె ఆస్మాన్‌గఢ్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాలపై వేలాడే కేబుళ్లతో ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు.


డీఈకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ అరుణ

పోస్టర్ ఆవిష్కరణ



నాగోలు: ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పథకం అమలు చేయాలని సెప్టెంబర్ 1న ఇందిరా పార్కు వద్ద ప్రోగ్రెసివ్ టీచర్ యూనియన్ (పీఆర్టీయూ) ధర్నా విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తుల శ్రీనివాస్ రెడ్డి కోరారు. బుధవారం సంఘ నాయకులతో కలిసి నాగోలు జైపురికాలనీలో ధర్నా పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయులందరూ ఒక రోజు సెలవు పెట్టుకొని సెప్టెంబర్ 1న నిర్వహించే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హనుమంత్ రెడ్డి, అనంతరెడ్డి, కరుణాకర్ రెడ్డి, ఉపేందర్, కనకయ్య, సతీష్, రామ్ చందర్, నిర్మల, జ్యోతి, లక్ష్మీ దేవి, రజిత పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళి

మన్సూరాబాద్: సాంకేతిక విప్లవానికి నాంది పలికి ఆధునిక భారత్‌కు బాటలు వేసిన మాజీ ప్రధానీ రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు ఎల్‌బీనగర్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మి ప్రసన్నగౌడ్, వజీర్ ప్రకాష్‌గౌడ్, యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యాంచరణ్‌రెడ్డి హాజరై పూల మాలలు వేసి నివాళి అర్పించారు.



సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ పెంచాలి


డి. రాజాకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నాగోలు: సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ పెంచేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉప ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య కోరారు. బుధవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర మహాసభలకు వచ్చిన జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోల్ మైన్స్ పెన్షన్ స్కీం –1998 ప్రకారం కనీస పెన్షన్ రూ.1000 చెల్లిస్తున్నారు. ఈ పథకం ప్రవేశపెట్టి 27 సంవత్సరాలు గడిచినా కరువు భత్యంతో కూడిన పెన్షన్ చెల్లించకపోవడం బాధాకరమన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ తరఫున కోల్ మైన్స్ పింఛన్ స్కీం–1998 చట్టాన్ని సవరించి బొగ్గు పెన్షనర్లకు గౌరవప్రదమైన జీవితం కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెవాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో సారయ్య, వంగవెంకట్, దమ్మలపాటి శేషయ్య, వీరస్వామి ఉన్నారు.